ఈనాడు మెదక్



## ప్రధాన వార్తలు

# 'ఇంటి' చెంత స్పాట్ బిల్లింగ్

రాష్ట్రంలో సిద్దిపేటలోనే తొలిసారి

ప్రయోగాత్మక పరిశీలన; వారంలో ప్రారంభం

న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్




ఆస్తి, నల్లా పన్నును స్పాట్ బిల్లింగ్ పద్ధతిలో జారీ చేయనున్న తొలి పురపాలికగా సిద్దిపేట రికార్డులకెక్కనుంది. ఈ విధానం మరో వారం రోజుల్లో ప్రారంభం కానుంది. దీనికి సంబంధించి సోమవారం పురపాలికలో నిర్వహించిన ప్రయోగాత్మక పరిశీలన విజయవంతమైంది. ప్రస్తుతం ఈ విధానం హైదరాబాద్ మహానగర పాలక సంస్థలో మాత్రమే ఉంది. విజయవాడ కార్పొరేషన్‌లో త్వరలో అమల్లోకి రానుంది. పురపాలికల విషయానికి వస్తే రాష్ట్రంలో సిద్దిపేటలోనే తొలిసారిగా అమలు చేస్తున్నారు.

### ఏమిటీ బిల్లింగ్..?

బిల్ కలెక్టర్లు నేరుగా ఇళ్లకు వద్దకు వెళ్లి యంత్రం ద్వారా ఆస్తి పన్ను, కొళాయి బిల్లుకు సంబంధించిన డిమాండ్ నోటీసు అందజేస్తారు. సంబంధీకులు డబ్బు చెల్లించగానే.. అక్కడికక్కడే యంత్రంలో వివరాలు నమోదు చేసి రశీదు ఇస్తారు. తద్వారా.. బిల్లుల వసూలులో పారదర్శకత పెరగడంతో పాటు సిబ్బంది అవకతవకలకు పాల్పడే ఆస్కారం ఉండదు. ప్రజలకూ నేరుగా ఇంటి వద్దే రశీదు అందుతుంది. ఇకపై నల్లా బిల్లులను ఈ యంత్రం ద్వారా ప్రతి నెల వసూలు చేయనున్నారు. ఇందులో భాగంగా సిద్దిపేటకు 8 స్పాట్ బిల్లింగ్ యంత్రాలు వచ్చాయి. దీంట్లో నల్లా బిల్లులకు సంబంధించిన వివరాలు (డేటా) నమోదు చేశారు. ఆస్తి పన్నుకు సంబంధించిన సమాచారం నిక్షిప్తం చేసే ప్రక్రియ కొనసాగుతోంది. నాలుగు రోజుల్లో పూర్తి కానుంది. బిల్ కలెక్టర్లకు ఏ వార్డులు కేటాయిస్తారో వాటికి సంబంధించిన సమాచారాన్ని మాత్రమే యంత్రంలో పొందుపరుస్తున్నారు. ఒక యంత్రంలో మాత్రం పూర్తి సమాచారం నిక్షిప్తం చేశారు. వీటిని జీపీఆర్ఎస్ ద్వారా పురపాలిక కార్యాలయంలోని కంప్యూటర్‌కు అనుసంధానించారు. బిల్ కలెక్టర్ బిల్లింగ్ చేయగానే క్షణాల్లో ఆ సమాచారం కంప్యూటర్‌లోకి వచ్చేస్తుంది. హైదరాబాద్‌లో నల్లా బిల్లులు, ఆస్తి పన్ను సేకరణకు వేర్వేరు యంత్రాలు వినియోగిస్తుండగా, సిద్దిపేటలో మాత్రం ఒకేదాంతో చేయనున్నారు. ఇది మరో ప్రత్యేకతగా చెప్పొచ్చు. ప్రస్తుతానికి పాత పట్టణ పరిధిలో అమలు చేయనుండగా, విలీన గ్రామాల్లో తర్వాత చేపడతారు.

### బిల్ కలెక్టర్లపై నిఘా..

ఈ యంత్రాల్లో జీపీఎస్ ద్వారా ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశారు. బిల్ కలెక్టర్ తమకు కేటాయించిన వార్డులో రోజుకు ఎన్ని గంటలు తిరుగుతున్నారు.? ఏ సమయాల్లో తిరిగారు.? అనే సమాచారాన్ని కూడా పొందవచ్చు. చాలాచోట్ల బిల్ కలెక్టర్లు వార్డుల్లో ఉన్నామని చెప్పి, సొంత పనులు చేసుకుంటున్న ఉదంతాల నేపథ్యంలో.. వారిపై నిఘా పెరుగుతుంది. రోజుకు ఏ బిల్ కలెక్టర్ ఎంత పన్ను వసూలు చేశారో కూడా దీని ద్వారా తెలుస్తుంది.

### ప్రయోగాత్మక పరిశీలన

ఈ యంత్రాలు ఎలా పనిచేస్తాయి..? అని పురపాలికలో కమిషనర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రయోగాత్మక పరిశీలన చేశారు. ఈ వ్యవస్థను హైదరాబాద్‌కు చెందిన ఈఆర్‌వీ డైరెక్ట్ సొల్యూషన్ ఇండియా(ప్రైవేటు) లిమిటెడ్ సంస్థ ఏర్పాటు చేసింది. సంస్థ ప్రతినిధులు భాస్కర్, రాజశేఖర్ రెడ్డి.. కొందరు బిల్‌కలెక్టర్లకు సోమవారం యంత్రాల పనితీరుపై అవగాహన కల్పించారు.సమాచారం పూర్తిగా నిక్షిప్తం చేయగానే, దీనిపై ఒకరోజు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. వారం రోజుల్లో దీన్ని అమలు చేస్తామని కమిషనర్ లక్ష్మణ్ వెల్లడించారు. దీని ఏర్పాటుకు రూ.8 లక్షలు వెచ్చించినట్లు తెలిపారు.